# మళ్ళీ పాతకథే?

అది క్రీ. శ. 1980.

"పాతికవేలు కట్నంతో ఒక సంబంధం వచ్చింది ప్రభాకర్. చేసుకుంటావా ?"

నిర్ఘాంతపోయి నిల్చున్నాడు ప్రభాకర్.

మాట్లాడుతున్నది అమ్మేనా ? నిజంగా అంటుందా ? లేకపోతే, తనను పరీక్షిద్దామని వేళాకోళం చేస్తుందా ?

నువ్వుకూడా కట్నం తీసుకోమని చెపుతున్నా వేమిటమ్మా?"

ఎటూ తేలకుండా గడుసుగా అన్నాడు.

"ఆదర్శాలు, ఆశయాలూ ఇవన్నీ చిలకపలుకులూ వ్యవహారంలో అందరికీ కావలసింది డబ్బే! నీ అభిప్రాయం చెప్పు."

ప్రభాకర్ నమ్మలేక తల్లిముఖంలోకి చూసాడు. నిర్వికారంగా గంభీరంగా ఉన్న ఆ ముఖంలో అతనికే భావమూ అంతుపట్టలేదు.

"ఎవరమ్మాయి ?''

''అదంతా నీ కెందుకు ? పాతిక వేలు తీసుకుంటున్నప్పుడు మిగిలిన విషయాలను గురించి ఆలోచించే అధికారం నీకు లేదు. నీకు పాతిక వేలు కావాలా ? వివరాలు కావాలా?"

మతిపోతోంది ప్రభాకర్‌కి. అనుమానంగా తల్లివంక చూస్తూ ఏమిటమ్మా! నన్ను తమాషా చేస్తున్నావా ?''

''తమాషా చెయ్యటంలేదు. నిజంగానే చెప్తున్నాను. నీకు పాతిక వేలు కావాలంటే చెప్పు. వచ్చేవారంలోనే ముహూర్తం నిశ్చయమయి పోతుంది. డబ్బు ముందుగానే నీకిస్తారు. పెళ్ళికూతురుని గురించిన వివరాలు తరువాత ఎలానూ తెలుస్తాయి. పెళ్ళికూతురి వివరాలే ముఖ్యమను కుంటే ఈ సంబంధం వదులుకో. వివరాలు తెలిసిన వ్యక్తిని చేసుకో!''

గంభీరంగా అంది అరుంధతి.

''ఏమిటమ్మా! కథలోలాగ '' నవ్వి వేళాకోళంగా మార్చడానికి ప్రయత్నించాడు ప్రభాకర్. అరుంధతి నవ్వలేదు, దీర్ఘంగా నిట్టూర్చింది. ''అవును నాయనా! మనలాంటి వాళ్ళం ఉండబట్టే కథలు బయ ల్దేరుతున్నాయ్. నీ సమాధానం చెప్పు, ఇది వేళాకోళం కాదని ప్రభాకర్‌కి నిశ్చయమయింది—

''నీ యిష్టమమ్మా! నీ యిష్టం ఎప్పుడు కాదన్నాను గనుక!''

చాలా సంతోషం నాయనా నీ లాటి కొడుకుని కన్నందుకు చాలా గర్వంగా ఉంది.''

అరుంధతి కంఠస్వరంలో ఏమాత్రం సంతోషం ధ్వనించలేదు సరి గదా, తీక్షణత్వం ధ్వనించింది. ఆమె కళ్ళలో ఏదో వ్యథ ఎంత అణ చినా అణగక తొంగి చూసింది. తెల్లబోతూ తల్లి ముఖంలోకి పరిశీలనగా చూడబోయాడు ప్రభాకర్. సంతోషంతో ఉక్కిరిబిక్కి రయిపోయాడు. పాతికవేలు, కేవలం ఒక పిల్లమెళ్ళో తాళిగట్టినందుకు జీవితాంతమూ ఒక వ్యక్తిమీద సర్వాధికారాలూ అంది పుచ్చుకున్నందుకు.

''కార్యేషు దాసీ!'' — భలే!

'కరణేషు మంత్రి'—తను వెలగబెట్టవలసిన రాచకార్యాలేం లేవు. తనకు మంత్రి అక్కరలేదు.

''శయనేషు రంభ.''—రంభలాంటి దయితేనేః కాకపోతే, ఏదీ లేదు.

అయినా ఆ అమ్మాయి ఎలాంటిదయితేనేం? వివరాలు తనకు తెలియక పోతేనేం? పెళ్ళికీ జీవితంలో ఆనందానికీ సంబంధ మేముంది? మన హిందూ సంఘం మొగవాళ్ళకి మహమంచి సంఘం. ఎంతమంచిదో! మొగవాళ్ళకి వాళ్ళ ఆనందమంతా పెళ్ళిలోనే ఇమిడిపోవాలని శాసించదు. అదొక లాభం. అప్పనంగా మొగవాళ్ళకి బోలెడు డబ్బు సంపాదించి పెట్టే మంచి సాంఘికాచారం.

తల్లి ప్రవర్తనే ఎంత సమాధానపరచుకున్నా కొంత వింతగా అని పించింది, ప్రభాకర్‌కి.

చిన్నప్పటినుండి ప్రభాకర్‌కూ మిగిలిన పిల్లలకూ తల్లి కనుసన్న లలో మెలగటమే అలవాటు. తండ్రి ఎప్పుడూ ఆఫీస్ పనిలోనో తప్పితే స్నేహితులతోనో గడిపేవాడు. పిల్లల బాధ్యతంతా అరుంధతిదే అయింది. ఆ బాధ్యత అరుంధతి సంతోషంతో స్వీకరించింది.

పిల్లలందరికీ తల్లిదగ్గర ఎంత గారాబమో అంత గౌరవం — ఎంత చనువో అంత భయం. చిన్నతనంనుంచి కూడా వాళ్ళకు అమ్మ దగ్గిర ఏ పేచీలు సాగుతాయో, ఏవి సాగవో తెలుసు.

చాక్‌లెట్లు కావాలని పేచీలు పెట్టగలరు. పాఠాలు చదవకుండా హోమ్‌వర్కు చెయ్యకుండా ఆడుకుంటామని అడగటానికి సాహసించరు.

కథలు చెప్పమని పీడించగలరు.

పెద్దవాళ్ళ కబుర్లలో మాత్రం కలుగజేసుకోలేరు. ఏది కావలసినా నిర్భయంగా అడగగలరు. అబద్ధాలాడడానికి మాత్రం గుండెలుండేవి కావు.

తన వ్యక్తిత్వపు నీడ పిల్లలమీద పడకుండా వాళ్ళ వాళ్ళ సహజ వ్యక్తిత్వాలను క్రమబద్ధంగా వికసింపజేయడానికే అరుంధతి మొదటినుంచీ ప్రయత్నించింది.

ప్రభాకర్ డాక్టరవ్వాలని అరుంధతి కోరిక, "నాకు వైద్యంలో ఇంటరెస్ట్ లేదు. ఇంజనీరింగు చదువుకుంటాను." అని ప్రభాకర్ అన్నప్పుడు అడ్డు చెప్పలేదు.

మొగపిల్లలతోపాటు ఆడపిల్లలకు కూడా చదువుకొన్నంత వరకూ చెప్పించాలని మాలతిని కాలేజీలో చేర్పించింది.

రెండు రోజుల్లోనే "నాకు చదువు విసుగ్గా వుందమ్మా! సంగీతం నేర్చుకుంటాను." అంటే, ఇంటికే సంగీతం మాస్టర్ని పిలిపించి సంగీతం నేర్పించింది.

ప్రభాకర్‌కి పెళ్ళి సంబంధాలు రాసాగాయి, "కట్నం ప్రసక్తి నా దగ్గిర తేవద్దు. మా అబ్బాయికి డబ్బు ప్రధానంకాదు. వాడి మనసుకి నచ్చితేచాలు. నాకు నచ్చవలసిన అవసరమూ లేదు."—అని పెళ్ళి వారితో మాట్లాడుతున్న తల్లివంక విచిత్రంగా చూశాడు ప్రభాకర్. ప్రభాకర్ ఇంజనీరింగు కాలేజీలో చేరాక మెల్లమెల్లగా తల్లి వ్యక్తిత్వపు పరిధి లోంచి తప్పుకు పోసాగాడు. అతడు తన బాధ్యతలు గుర్తించాడని అర్థం చేసుకున్న అరుంధతి అతనికి అన్ని విషయాలలోనూ స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం కలిగించింది, మొదటినుండి అలవడ్డ క్రమశిక్షణ,

చదువుల్లో తల్లి కలిగించిన ఆసక్తి కారణంగా ప్రభాకర్ చదువులో ఏనాడూ వెనక పడలేదుకాని, అతనికి చాలా మంది స్నేహితులు పోగయ్యారు. అప్పుడప్పుడే యవ్వనంలో అడుగు పెడుతున్న అతనికి స్నేహితుల సాంగత్యం వలన, ఆడపిల్లలు, ప్రణయం, పెళ్ళి ఇట్లాంటి విషయాలలో వింతవింత అభిప్రాయాలు ఏర్పడిపోయాయి. ఈ విషయాలలో తల్లి ప్రభావం పడటానికి వీలులేదు.

కూతురితో తప్ప కొడుకుతో ఇట్లాంటి విషయాలు ప్రస్తావించలేదు. తండ్రికి డబ్బుపట్ల గల విపరీతమైన కాంక్ష ప్రభాకర్‌కి సంక్రమించింది. తనకంటె చదువులో ఎంత వెనుకబడి పాస్ అవుతారా, లేదా? అని సందేహంగా ఉండే యువకులు కొందరు కేవలం ఇంజనీరింగులో చేరిన కారణంగా పదివేలు కట్నం తీసుకుని పెళ్ళి చేసుకోవటం, అతని నధికంగా ఆకర్షించింది. ఇంజనీరింగు డిగ్రీ తీసుకున్నాక, అతనికి తన విలువా, చదువు విలువా బాగా అర్థమయిపోయాయి. ఇరవయివేలు, కనీసం (పెళ్ళికూతురు చాలా బాగుంటే) పదిహేను వేలు కట్నం వస్తుంది తనకు. అది తన హక్కు. ఎందుకు వదులుకోవాలి? తల్లికట్నం వద్దనేస్తూంటే, అతని ప్రాణం విలవిలలాడిపోయింది. కాని "నాకు కట్నం కావాలి" అని తల్లితో చెప్పే సాహసం మాత్రం లేదు. పాపం, ఈ కారణంగానె కొన్ని సార్లు పిల్ల అన్ని విధాలా నచ్చినా కూడా 'నాకు నచ్చలేదు' అనెయ్యవలసి వచ్చింది అతడు. ఎన్నో విషయాలు అర్థం చేసుకోగలిగిన తల్లి తన మనసులో విషయం ఊహించలేదా అని కొడుకు—తన చేతులలో పెరిగిన కొడుకు మనసులో ఇలాటి ఆలోచనలుంటాయని ఊహించలేని తల్లి. మిగిలిన అన్ని విషయాలలో అలగే ఈ విషయంలోనూ కల్పించుకోని తండ్రీ.

దానా, దీనా, ప్రభాకర్ వివాహం రోజురోజుకు వాయిదా పడ సాగింది. కట్నం ప్రస్తావన లేకుండా తల్లి పెళ్ళి సంబంధాల వివరాలు

చెపుతుంటే విసుక్కుని వెళ్ళిపోయేవాడు. కొడుక్కి అప్పుడే పెళ్ళంటే ఇష్టంలేదు కాబోలు అనుకుంది అరుంధతి.

ఇన్నాళ్ళకు తల్లే స్వయంగా పాతికవేలు కట్నమని చెపుతుంటే ఆనందం పట్టలేకపోయాడు ప్రభాకర్.

"ఇదిగో డబ్బు లెక్క పెట్టుకో!" అంది అరుంధతి.

"అదేమిటి ? ముందుగానే ఇచ్చేశారా ?"

"ఆ! ముందుగానే అడిగి తీసుకున్నాను. లెక్కపెట్టుకో!"

"నువ్వు లెక్కపెట్టావుగా !"

"డబ్బు విషయంలో ఎవరినీ నమ్మకూడదు. లెక్కపెట్టుకో!"

"అదేమిటమ్మా! నాకు నీలో నమ్మకం లేకపోవడమేమిటి ? అయినా, నాకివ్వటం దేనికి ? నీ దగ్గరే ఉండనియ్యి."

అరుంధతి డబ్బు అతని ముందు పడేసి అక్కడినుండి వెళ్ళిపోయింది. ఒక్క క్షణం బాధపడ్డా, అరుంధతి చూడటంలేదని నిర్ధారించుకున్నాక జాగ్రత్తగా లెక్కపెట్టుకుని సంతృప్తిగా దాచుకున్నాడు ప్రభాకర్.

పెళ్ళికూతురు ఊరికి అట్టహాసంగా తరలి వెళ్ళారు. మొగపెళ్ళివారు, తన పెళ్ళినాడు కూడా తల్లి నగలు పెట్టుకోకుండా మంగళసూత్రాల గొలుసుతో ఉండటం నచ్చలేదు. ప్రభాకర్‌కి.

"నీ నగలన్నీ పెట్టుకోరాదా, అమ్మా ?" అన్నాడు.

"చిన్నతనంలోనే నగలంటే ఆసక్తి లేదు. నాకు—ఇప్పుడింక నగలెందుకూ ?"

విసుగ్గా అంది అరుంధతి. తల్లి విసుగుచూసి ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.

పెళ్ళిపీటల మీదకు వచ్చి కూర్చున్న పార్వతిని చూడగానే ప్రభాకర్ రక్తమంతా ఒక్కసారిగా గడ్డకట్టుకు పోయింది.

"నువ్వా ?" అన్నాడు—

పార్వతి ఒక్కసారి కనురెప్పలెత్తి అతనిని చూసి తలదించుకుంది.

చివాలన లేవబోయాడు ప్రభాకర్.

"నీ పాతికవేలు నీకు ముట్టాయ్ ప్రభాకర్ ! నువ్వు లేవడానికి వీల్లేదు—

కొడుకు యుక్తవయస్కుడైన తరువాత మొదటి సారిగా ఆజ్ఞాపించింది అరుంధతి.

ప్రభాకర్ మనసులో ఎన్ని ప్రళయాలు చెలరేగుతున్నా శరీరం అతనికి తెలియకుండానే తల్లి ఆజ్ఞను పాలించింది.

పురోహితుడి మంత్రాలూ, ఎవరివో వేళాకోళాలూ పెళ్ళి పందిట్లో సందడే సందడి ! వీటన్నింటినీ అధిగమించి, ఈ విషయమే, అతడి మనసునంతా వశపరచుకుని, అల్లకల్లోలం చేస్తోంది.

పెళ్ళి తంతు పూర్తయి, విడిదికి చేరుకున్నాక ప్రభాకర్ కొంత తేరుకున్నాడు. అరుంధతి అతనికి ఎదురుగానే కూర్చుంది. ఇంక ప్రభాకర్ తనతో మాట్లాడుతాడని ఆవిడకు తెలుసు. ఎంతసేపు ప్రయత్నించినా, తల్లి ముఖంలోకి చూడలేని ప్రభాకర్ ఎటోచూస్తూ "పార్వతిని గురించి నీకేం తెలుసునని నీ కోడలిగా చేసుకున్నావు?" అన్నాడు.

"అన్నీ తెలుసు. అందుకనే ఈ నిర్ణయానికి వచ్చాను."

"ఏమీ తెలియదు, పార్వతి కల్లబొల్లి కబుర్లు నమ్మావు. నన్ను ఊబిలోకి దింపావు.'

'ఇది ఊబి అని నేను అనుకోను. ఊబే అయితే దింపింది నేను కాదు.'

ఒక్కసారి విసురుగా తల్లిముఖంలోకి చూసిన ప్రభాకర్ ఆ ముఖం లోని గాంభిర్యానికీ కాఠిన్యానికీ తట్టుకోలేక చూపులు తిప్పుకున్నాడు.

'పార్వతి గుణం మంచిదికాదు.'

'నేను నమ్మను. నా కొడుకు గుణం మంచిది కాదని తెలిసిన అమ్మాయితో వదలడానికి వీల్లేనంత గాఢమయిన అనుబంధాన్ని ఏర్పరచు కోడు.'

తల్లితో వాదించగలిగే శక్తి ప్రభాకర్‌కెన్నడూ లేదు. అందులో ఈ విషయంలో అసలు వాదించలేకపోతున్నాడు. ఎలాగో అన్నాడు—

'నాకు తెలుసు ఆ అమ్మాయి మంచిదికాదు. కానీ నేను మొగ వాణ్ణి.'

'నీకెలా తెలుసు?'

'అందరూ అనుకుంటారు.'

'ఆ మాత్రం ఆధారంతో అభాండాలు వెయ్యడానికి సిద్ధపడతావా?'

'నా అనుభవం నాకుంది.'

'ఏమిటది? పదిసార్లు ప్రాధేయపడి, మనసును మైమరపించే మాయమాటలు చెప్పి అంతులేనన్ని ఆశలు కల్పించి, నిలువనీయకుండా కవ్విస్తే, ప్రతిస్పందన చూపకుండా ఉండలేవి సాధారణ మానవత్వాన్ని కలిగి ఉండటమా?'

'నువ్వు కవిత్వం మాట్లాడితే నేను చెప్పలేను కాని, శీలం కలిగిన వాళ్ళెవరూ అంత తేలికగా ఒక యువకుడికి లొంగిపోరు. ఆ అమ్మాయి

అట్లాంటిదని తెలుసు గనుకనే ఆవిడతో పరిచయం చేసుకున్నాను. ఇట్లా మెడకు తగిలించుకుందామనుకోలేదు.’

‘అంతనిశ్చయంగా తెలుసుకున్న వాడివి ఆ రకంగానే అనుబంధాన్ని కలిగించుకోకపోయావా ? మాయమాటలు చెప్పటం, అనవసరమైన ఆశలు కల్పించటం, అబద్ధపు వాగ్దానాలు చెయ్యటం— వీటి అవసరమేముందీ ?’

“ఇది ఒక ఆట. ప్రతి ఆటకు కొన్ని విషయాలుంటాయి.”

“సరిగ్గా ఇలాంటి సమాధానమే ఆశించాను. జీవితంలో అత్యంత సంతోష ప్రధాయకమైన విషయాన్ని ఆటగా తీసుకుని అసలు సంతోషమంటే ఏమిటో తెలుసుకోలేని మందభాగ్యులై పోతున్నారు మీరంతా. ఇది ఆట అని నువ్వన్నా నేను వప్పుకోను. ఆట కాని దాన్ని, జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయాన్ని, ఆటగా తీసుకున్న నువ్వు ఇకనైనా, దాని విలువను గ్రహించాలి—”

“గ్రహించేందుకు విలువ అనేది ఏమీ లేదు.”

“నువ్వు తండ్రివి కాబోతున్నావని నీకు తెలుసునా?

ఆ అమ్మాయి తల్లి కాబోతుందని తెలుసు.

‘ప్రభాకర్’ గర్జించింది అరుంధతి.

‘కేవలం ప్రకృతి నీమీద ఏ బాధ్యతను వేయదన్న ధైర్యంతో ఒక నిండు జీవితాన్ని నాశనం చెయ్యటానికి సిద్ధపడుతున్నావు. నీ అంతరాత్మ ఏమైందీ ? చక్కని క్రమశిక్షణలో పెంచుకొంటున్న నా కొడుకులో సాధారణ మానవత్వం కూడా కరువైందా?

నా కంతా తెలుసు ప్రభాకర్. నువ్వెన్ని మాయమాటలు చెప్పావో ?.... ఎంతగా లాలించి బెదిరించి బుజ్జగించి తండ్రివి కాబో

తున్నావో నాకు తెలుసు—కేవలం నీమీది మమకారంతో నిన్ను కాదన లేని గౌరవంతో, తన అవిశ్వాసానికి నీకు కోపం కలుగుతుందేమోనన్న భయంతో జీవితాన్ని నీ ముందు పఱచి ఆత్మార్పణ చేసుకున్న స్త్రీ జీవితాన్ని ధనకాంక్షతో అణగతొక్కేయ్యాకు. పైగా నాకు డబ్బంటే ఆశ అనీ కట్నం లేకుండా చేసుకోవడానికి నేను ఒప్పుకోననీ, ఆ అమాయకురాలి దగ్గిర మొసలి కన్నీళ్ళు కారుస్తావా? ఇన్నాళ్ళు నిన్ను పెంచిన నీ తల్లికి మంచి ప్రతిఫలమిచ్చావయ్యా!'

ప్రభాకర్ వంచిన తల ఎత్తలేకపోయాడు. ఎంతోసేపటికి 'అది నీదగ్గిరకు వచ్చిందా!' అన్నాడు.

'వచ్చింది తన పరిస్థితి వివరించింది, నాకు డబ్బే ముఖ్యమని నీ ద్వారా తెలుసుకుంది కనుక. డబ్బుకోసం తన జీవితాన్ని నాశనం చేయవద్దని ప్రాధేయపడటానికి వచ్చింది.'

'అది ఎంతకైనా తెగించగలదు'

'అది, ఇది అనకు, విని సహించలేకపోతున్నాను. అవును తెగించగలదు. ఒకసారి ఒకందుకు తెగించిన తర్వాత ఇక దేనికైనా తెగించక తప్పదు. అందుకనే ప్రాణాలు విడవటానికైనా తెగించి చివరి ప్రయత్నంగా నా దగ్గిరకు వచ్చింది.'

'నువ్వు పిచ్చిదానివి, చావమను—చస్తుందేమో చూద్దాం'

'నువ్వనగలవు అలా! నేననలేను. ఆడదాన్ని. అయినా తాళి కట్టేశావుగా! ఇక ఆ బొందిలో జీవం నశింపచేయటం నీకెంతపని?'

అరుంధతి కంఠం జీరవోయింది. కొంచెం సేపటి వరకు ప్రభాకర్ నోరు మెదపలేకపోయాడు. తరువాత జంకుతూ "పార్వతికి ఇంత డబ్బెక్కడిదీ?" అన్నాడు

"నేనిచ్చాను నా నగలు ప్రావిడెంటుఫండు ఇన్సూర్యెన్సు ఇవన్నీ కలిపి——

నిర్ఘాంతపోయాడు ప్రభాకర్.

'నువ్వెందుకు ఇవ్వటం ?'

'ఇది నాకు నేను విధించుకున్న జరిమానా మా పైతరంలో తల్లులలో చదువుకున్నవాళ్ళు తక్కువకావటం వల్ల పిల్లలను సక్రమంగా పెంచలేకపోయారనీ, అందువల్లనే సంఘంలో ఇంతమంది సంకుచిత స్వభావులు బయలుదేరి జీవితం సంకటమయం అయిందనీ ఊహ పడే దాన్ని, మాతరంలో చదువుకున్న తల్లుల సంఖ్య ఎక్కువ కావటంవల్ల మా పిల్లలను సక్రమంగా పెంచగలుగుతామనీ, కనీసం మా తరువాత తరంలో నయినా, సంఘంలో విశాల దృక్పథం ఏర్పడి జీవితం కొంత సుఖమయం కావచ్చునని ఆశపడ్డాను నిండుగా బ్రతుకుతున్న నా మనవ రాళ్ళను కూచోబెట్టుకుని తప్పనిసరిగా మోయవలసిన భారంగా బ్రతుకును భావించే మాతరంవాళ్ళ కథలు చెప్పాలని కలలు కన్నాను. నావన్నీ ఒట్టి ఊహలని తేలిపోయింది. నా కొడుకును ఇంత నిరర్థకంగా పెంచినందులకు నాకు నేనే విధించుకున్న జరిమానా ఈ పాతికవేలు.

ప్రభాకర్ ఏ సమాధానమూ చెప్పలేదు. అతని ముఖంలో ఆ ప్రసన్నభావం పూర్తిగా తొలగిపోలేదు. అరుంధతి సహించలేకపోయింది.

'పాతికవేల కోసం కళ్ళుమూసుకొని జీవితాంతము ఉండవలసిన బంధాన్ని ఏర్పరచుకోవడానికి సిద్ధపడ్డావు. నీకు తెలియకుండా ఇంత కంటే అయోగ్యురాలు ఈ స్థానంలో వున్నా నీ కభ్యంతరం ఉండేది కాదు. నిన్ను నమ్మి తన సర్వస్వమూ నీ చేతులలో పెట్టిన వ్యక్తిని మాత్రం సహించలేవా ?'

"నువ్వుచూచిన సంబంధం కదా అని నిశ్చింతగా ఉన్నాను "

'మరి, ఆ గౌరవం నామీద అలాగేవుంచు. పార్వతిని మనసారా మన్నించు. మీరిద్దరూ కలిసి చేసిన తప్పు పనికి ఆమె నొక్కదాన్నీ శిక్షించకు. అంత స్వార్థపరుడివికాకు.

అరుంధతి కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి. తన తల్లి కళ్ళలో నీళ్ళుచూసి చలించిపోయాడు ప్రభాకర్. అతనికి జ్ఞానం వచ్చాక ఎన్నడూ తల్లి కన్నీళ్ళు చూడలేదు. తల్లి బేలగా మరొకరి ముందు తేలిపోవడం అతను ఊహించలేని విషయం.'

"నన్ను క్షమించమ్మా!" కాతర స్వరముతో అన్నాడు. కన్నీళ్ళు తుడుచుకుంది అరుంధతి.

"తల్లి బిడ్డల్ని క్షమించకుండా ఉండలేదు ప్రభాకర్. గతాన్ని తవ్వుకోక పార్వతిని సుఖపెట్టి నువ్వు సుఖపడు"

లజ్జాభారంతో వంగిన కొడుకు శిరసును ఆప్యాయంగా నిమిరింది అరుంధతి.